క్లుప్తంగా

వేలంపాటలో రూ.43.90 లక్షల ఆదాయం

గాలివీడు : వారాంతపు సంత వేలంపాటలో గాలివీడు గ్రామ పంచాయతీకి రూ.43.90 లక్షలు ఆదాయం వచ్చినట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్, సర్పంచ్ లక్ష్మిదేవమ్మ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో డీపీఓ మస్తాన్ వలీ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన వేలంపాటలో కూరగాయల సంత రూ.14.3 లక్షలకు కె.గంగాధర్ నాయుడు, పశువుల సంత రూ.23.56 లక్షలకు కె.బాలప్పనాయుడు, బస్టాండ్ గేటు రూ.6.31 లక్షలకు కె.గంగాధర్ నాయుడు దక్కించుకున్నట్లుగా వారు తెలియజేశారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని ఒంటిమిట్టలో శుక్రవారం ఎంపీడీఓ కుళ్లాయి బాబు చెరువు కాలువ పూడికతీత పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఉపాధి కూలీలతో మాట్లాడుతూ ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పనివేళలు వంటి విషయాలను వారికి క్షుణ్ణంగా తెలియజేయడమైంది. కొత్తమాధవరంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ప్రజలకు తడిచెత్త, పొడి చెత్త కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కెఆర్‌ఎం ప్రసాద్, ఏపీఓ శివశంకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఏటీ శ్రీవాణి, ఎఫ్ఏ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు శక్తి యాప్



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ కుళ్లాయప్ప

రాజంపేట : మహిళల భద్రతకు అండగా శక్తి యాప్ ఉంటుందని మన్నూరు సీఐ కుళ్లాయప్ప అన్నారు. శుక్రవారం బోయనపల్లెలోని లేడీస్ హాస్టల్స్‌ను ఆయన సందర్శించి, ప్రతి ఒక విద్యార్థిని శక్తి మొబైల్ యాప్ ప్రతి ఒక్కరి మొబైల్‌లో ఉండాలని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ మహిళ భద్రతే ధ్యేయంగా ప్రభుత్వం శక్తియాప్‌ను తీసుకొచ్చిందన్నారు. ప్రతి విద్యార్థిని తమ మొబైల్ శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. యాప్ కలిగివుండటం వల్లే జరిగే లాభాలను వివరించారు. విద్యార్థినులకు భద్రత కల్పించే విషయంలో ఎప్పుడూ ముందుంటామన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం

గాలివీడు : మండల కేంద్రంలో ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ జవహర్‌బాబు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం గాలివీడు-2 సచివాలయం సెంటర్‌ను పరిశీలించామన్నారు. 100 మంది అభ్యర్థులను శిక్షణ నిమిత్తం తీసుకోవడం జరుగుతుందన్నారు. బీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ఉచితంగా టైలరింగ్ మిషన్ మంజూరు చెయ్యడం జరుగుతుందన్నారు. ఈనెల 22వ తేదీలోపు సచివాలయాల్లో సరైన ధృవీకరణ పత్రాలను సమర్పించాలన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులు

బ్యానర్‌లో బాధను తెలియజేసిన బాధితుడు



రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని లక్ష్మీ ప్యారడైజ్ వద్ద పి.మోహన్ రాజు కొన్ని సంవత్సరాలుగా పాత ఇనుప, ప్లాస్టిక్ సామానులు వ్యాపారం నిర్వహిస్తూ ఉండేవాడు. కరోనా కాలంలో అప్పుల పాలు కావడంతో వడ్డీలు కట్టలేక ఐపీ పెట్టాడు. అయితే గత కొంతకాలంగా అప్పటి వడ్డీ వ్యాపారస్తులు మోహన్ రాజును తీవ్ర ఒత్తిడి చేస్తూ డబ్బు కట్టాలని అనధికారికంగా వేధిస్తున్నారు. ఒత్తిడి తట్టుకోలేని బాధితుడు నాకు అప్పులు ఇచ్చిన వారికి విజ్ఞప్తి అని ప్రధాన రహదారిలో బ్యానర్ ఏర్పాటు చేసి తన బాధలను ప్రస్తావించాడు. ప్రస్తుతం బాధితుడు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

క్షయవ్యాధి నిర్ధారణకు అవగాహన తప్పనిసరి

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం పీహెచ్‌సీ పరిధిలోని రాయవరం గ్రామంలో క్షయవ్యాధి మాసోత్సవం సందర్భంగా డాక్టర్ శేఖర్‌రెడ్డి శుక్రవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ లక్షణాలు ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. జబ్బు నిర్ధారణ అయితే ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. ఆరు నెలలు మందులు వాడితే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, సీహెచ్‌ఓ సాల్మన్, ఏఎన్‌ఎం నాగభూషణం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంటికి రెప్పలా కాపాడారు..

గిట్టుబాటు లేక డీలాపడ్డారు



పసుపును మిషన్‌లో ఉడికిస్తున్న కూలీలు



పసుపును ఉడికించేందుకు మిషన్ వద్దకు తీసుకువెళుతున్న కూలీలు

- రూ.లక్ష వరకు పెట్టుబడి
- ప్రస్తుతం ఉన్న ధరకు విక్రయిస్తే నష్టాలే అని వాపోతున్న రైతులు

సిద్దవటం: రైతులకు మంచి లాభాలు తెచ్చే పంటల్లో పసుపు పంట ఒకటి. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపు పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ ఏడాది మార్కెట్‌లో పచ్చి పసుపు పుట్టి రూ.4,100 ఉంది ఉడకేసిన పసుపు క్వింటాల్ రూ.10 వేలు ఉంది. మండలంలోని భాకరాపేట, మిట్టపల్లి, మందపల్లె, బొగ్గిడివారిపల్లె, మలినేనిపట్నం కాలనీ, మాధవరం-1, మొదీన్‌సాబ్‌పల్లె, నేకనాపురం, ముమ్మడిగుంటపల్లె, సిద్దవటం, ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, జంగాలపల్లె మరికొన్ని గ్రామాల్లో 322 ఎకరాల్లో రైతులు పసుపు పంటను సాగు చేశారు. పసుపు సాగుచేసే రైతులు ఏడాది కాలం కష్టపడాలి. దీంతో సాగు చేసిన పంటకు తెగుళ్లు రాకుండా సస్యరక్షణ చర్యలు పాటిస్తూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చారు. పంట చేతికి అందే సరికే ఎకరాకు రూ. 90వేల నుంచి రూ.లక్ష వరకు పంటపై పెట్టుబడులు పెట్టారు. ఎకరా సాగుకు 6 పుట్ల విత్తనం పసుపు పట్టింది. అప్పట్లో పుట్టి పసుపు విత్తనం రూ.11వేలతో కొనుగోలు చేసి సాగు చేశారు. పసుపు ఎకరాకు 40 పుట్లు నుంచి 60 పుట్ల వరకు దిగుబడులు వచ్చాయి. దిగుబడులను కొనేందుకు వ్యాపారస్తులు ఎవరూ రాకపోవడంతో పచ్చి పసుపును ఉడకేసి నిలువ చేస్తున్నారు. ఉడకేసిన పసుపు ఒక క్వింటాల్ రూ.10వేలు పోతుండటంతో గిట్టుబాటు ధర ఆశించినంత లేకపోవడం వల్ల పచ్చి పసుపును ఉడకేసుకుంటున్నారు. మిషన్‌లో పసుపును ఒక సారి ఉడకేసినందుకు రూ. 600 తీసుకుంటున్నారు. కొందరు రైతులు మార్కెట్ ధర ఆశించినంత లేకపోవడంతో ఉడకేసిన పసుపును సంచుల్లో నింపి యార్డులో నిల్వ చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు.

ధర లేక నష్టపోతున్నాం



పసుపు పంట సాగుచేస్తే లాభాలు వస్తాయని ఆశతో పంటను సాగు చేశాను. అమ్మకానికి వచ్చే సరికే పంట ధర పడిపోయింది. కనీసం పెట్టుబడులు వచ్చేలా కనిపించలేదు. ఏడాది కష్టానికి ఫలితం అందుతుంది అనుకునేలోపు ధర పడిపోవడంతో తీవ్ర ఆవేదనకు గురి చేస్తోంది. – చిట్టిబోయిన రమణ, మలినేనిపట్నం కాలనీ, సిద్దవటం మండలం

వ్యాపారస్తులు రావడంలేదు



పసుపు దిగుబడులను కొనుగోలు చేసేందుకు వ్యాపారస్తులు ముందుకు రాలేదు. దీంతో తాము పండించిన పసుపు పొలాల్లోనే ఉంది. ఇంకా తొవ్వనూ లేదు. గతంలో గుంటూరు ప్రాంతాల నుంచి వ్యాపారస్తులు వచ్చి పొలాల్లోనే పంటను కొనుగోలు చేసుకునే వారు. ఇప్పుడు ధర లేదని ఎవ్వరూ రాలేదు.

– కొండా శేషయ్య, మిట్టపల్లి, సిద్దవటం మండలం

దళిత నాయకులతో కొరముట్ల భేటి



దళిత నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : ఏప్రిల్ 14న డా. బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై శుక్రవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు నియోజకవర్గ దళిత నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతిని పండుగలా నిర్వహించాలన్నారు. దళితులందరూ జయంతి ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

31లోపు ఈకేవైసీ చేసుకోవాలి

పెనగలూరు : రైస్ కార్డు వినియోగదారులు ఈనెల 31వ తేదీలోపు ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ అమరేశ్వరీ తెలిపారు. మండలంలో 38,378 రైస్ కార్డులు ఉన్నాయని, వీటిలో 30,929 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారన్నారు. మిగిలిన 4,449 మంది రైస్ కార్డుదారులు ఈకేవైసీ తీసుకోలేదని ఆమె అన్నారు. ఈకేవైసీ తీసుకోని రైస్ కార్డుదారులు మీ సమీపంలోని డీలర్ వద్దకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని లేదా సచివాలయం దగ్గరకు వెళ్లి ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. ప్రతి రైస్ కార్డుదారుడు సహకరించాలని కోరారు.

హామీలను అమలు చేసిన ఘనత జగన్‌దే

గాలివీడు : 2019 ఎన్నికల్లో నేను చూశాను.. నేను విన్నాను అనే ఒకేఒక్క నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత రాజన్న బిడ్డ జగనన్నదేనని మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సోదరుడు, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి గడికోట సుదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సుదీప్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న తన పాదయాత్రలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలనే నవారత్నాల పేరుతో మేనిఫెస్టో తయారు చేసి 99 శాతం అమలు చేశారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అన్ని వర్గాల వారికి పార్టీలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. అదే విధంగా విద్య, వైద్యం, వ్యవసాయం పైన ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేశారన్నారు. నేడు గ్రామాల్లో సంక్షేమ పథకాల కోసం ఎదురుచూస్తున్నా అమలుపరిచే నాథుడే కరువయ్యారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషన్ రెడ్డి, సర్పంచ్ ఉమాపతి రెడ్డి, చెన్నకేశవ రెడ్డి, వాటర్ షెడ్ చైర్మన్ రమణారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ వెంకట్‌రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, ధర్మారెడ్డి, బండి అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జి గడికోట సుదీప్‌రెడ్డి

పిల్లల ఆరోగ్యంతో పాటు విద్య అవసరం

రామాపురం : పిల్లలకు ఆరోగ్యంతోపాటు విద్య చాలా అవసరమని లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ అధికారి పద్మావతి అన్నారు. శుక్రవారం మండలంలోని నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ భీ.. పడాయి భీపై అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజుల శిక్షణ నిర్వహించారు. ఎస్‌ఏఎమ్ ఎమ్ఏఎమ్ పిల్లల సంరక్షణ, 1000 రోజులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్తహీనత ఉన్న గర్భిణులకు, బాలింతలకు సూక్ష్మ పోషకాల, స్థూలపోషకాలు, ఆహారం పట్ల తీసుకోవాల్సిన ఆహార కార్యక్రమాలపై వివరించారు. 0–3 సంవత్సరాల పిల్లలకు అందించే విద్య నవచేతన, 3–6 సంవత్సరాలు పిల్లలకు ఇచ్చే విద్య ఆధార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజరాణి, హుసేనమ్మ, సుజాతరెడ్డిలు సూచనలు, సలహాలు అందించారు.



రామాపురం: అంగన్‌వాడీలకు సూచనలు చేస్తున్న మండల అధికారులు



ఒంటిమిట్ట: అంగన్‌వాడీలకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్ట స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం అంగన్ వాడీ వర్కర్లకు కడప అర్బన్ సిడిపిఓ శోభారాణి ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు మూడురోజులపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నామన్నారు. బాలికల విద్య, ఆరోగ్యం ప్రాముఖ్యత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎ.పద్మజ, వరలక్ష్మీ, ఆర్.విద్య పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ఓబులవారిపల్లె : రసాయన ఎరువులు వాడకం ద్వారా భూసారం తగ్గి నేల నిరుపయోగంగా మారుతుందని ప్రొఫెసర్ డాక్టర్ రూత్ మేరీ అన్నారు. శుక్రవారం చెలంపాలెం వ్యవసాయ పొలాల్లో అనంతరాజుపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన కళాశాల బీఎస్సీ హార్టికల్చర్ చివరి సంవత్సరం చదువుతున్న యువ వ్యవసాయ శాస్త్రవేత్తలతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రూత్ మేరీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూసారం పెరుగుతుందని, భూమి లోపల సూక్ష్మపోషకాల అభివృద్ధి చెంది పంటల దిగుబడి బాగా వస్తుందని తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన జీవామృతం, ఘనజీవామృతం, పురుగుల నివారణ కషాయాలు గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల పెంపకం, ఉద్యాన పంటల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతు వెంకట రామరాజు, పులపత్తూరి సుదర్శన్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సుండుపల్లె/లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని కేజీబీవీలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఆయా మండలాల్లోని కేజీబీవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివశృతి, నాగలక్ష్మిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా కార్యక్రమాల్లో మాట్లాడుతూ దరఖాస్తులు ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11వ తేదీల వరకు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని వివిఆర్ కండ్రిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు శ్రీకాంత్, నవీన్, కుమార్, మోహన్ తదితరులు రూ. 50 వేలు విలువజేసే కంప్యూటర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుతున్న పాఠశాలలోని ఇప్పటి విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని కంప్యూటర్‌ను అందించినట్లు తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ


వీరబల్లి : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే అదే మహాభాగ్యమని వీఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన కుమారుడు భువన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనీషా, జియావుల్లా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పది పరీక్షలు

సంబేపల్లె : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను శుక్రవారం కట్టుదిట్టంగా నిర్వహించారు. పరీక్షలకు హాజరయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రంలో 239 మంది విద్యార్థులకు గాను 239 విద్యార్థులు హాజరయ్యారు. ఆదర్శ పాఠశాల పరీక్షా కేంద్రంలో 171 మంది విద్యార్థులకు గాను 169 విద్యార్థులు హాజరయ్యారు. ఇద్దరు పరీక్షలకు గైర్హాజరైనట్లు సంబంధిత చీఫ్ అధికారులు రామక్రిష్ణ నాయక్, ఇలియాజ్‌లు తెలిపారు.

చిన్నతనం నుంచే నోటి శుభ్రతపై శ్రద్ధ చూపాలి

లక్కిరెడ్డిపల్లి : నోటి ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పలు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ప్రపంచ నోటి దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలోఫర్ బేగం మాట్లాడుతూ చిన్నతనం నుంచే తల్లిదండ్రులు తమ పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నోటి పరిశుభ్రత గురించి తెలియజేయాలని లేకుంటే దంత, గుండె వ్యాధుల తోపాటు మతిమరుపు వచ్చే ప్రమాదం ఉందన్నారు. రోజూ గోరు వెచ్చటి నీటితో పుక్కిలించాలన్నారు. ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ధరణి కుమార్, జీవన్‌కుమార్ రెడ్డి, మహేష్, భరత్, నిసార్, అహ్మద్ రెడ్డి, కీర్తి, సులోచన, రెడ్డి కృష్ణ, ప్రసాద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ముకుంద (42) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్ఐ రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం ఉదయం లక్కిరెడ్డిపల్లి మసీదు వద్ద ముకుంద విధులు నిర్వహిస్తూ ఉండగా చాతిలో నొప్పి రావడంతో లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని రామాపురంలోని తన ఇంటికి వెళ్లాడు. మళ్లీ ఛాతినొప్పి రావడంతో కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అతన్ని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పినట్టు బంధువులు తెలిపారని ఎస్ఐ అన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సీఐ కొండా రెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు స్టేషన్ సిబ్బంది ముకుంద మృతదేహానికి నివాళి అర్పించి సంతాపం తెలిపారు. శనివారం మృతుడి సొంత గ్రామం వీరబల్లి మండలం వంగిమళ్లలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ముకుంద (42) ఫైల్

గుర్తుండిపోయేలా విధులు నిర్వర్తించాలి

గాలివీడు : ప్రభుత్వ ఉద్యోగాలలో పదవీ విరమణలు, బదిలీలు సర్వసాధారణమే అయినా ఎన్ని రోజులు విధులు నిర్వహించామని కాకుండా మన సేవలు ప్రజలకు గుర్తుండిపోయే విధంగా ఉండాలని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం బదిలీపై వెళుతున్న పోలీస్ సిబ్బంది ఏఎస్ఐ పీవీ రమణ, కానిస్టేబుళ్లు నాగేంద్ర, పురుషోత్తం, రామాంజులు, రమేష్ బాబు, మదన్‌మోహన్‌ను సన్మానించారు. ఎస్ఐ మాట్లాడుతూ బదిలీపై ఎక్కడికి వెళ్లినా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకువచ్చేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

ఏడుగురు కొత్త సిబ్బంది గాలివీడు స్టేషన్‌కు

జిల్లా వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో గాలివీడు పోలీస్ స్టేషన్‌కు ఏఎస్ఐలు ఎస్.వెంకటేశ్వర్లు, కె.వేణుగోపాల్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సుబ్రమణ్యం, కానిస్టేబుళ్లు పి.నరేష్, జి.నరేష్, ఆరిఫుల్లా, ప్రభాకర్‌లు బదిలీపై వస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బదిలీపై వెళుతున్న పోలీసు సిబ్బందిని సత్కరిస్తున్న ఎస్ఐ రామకృష్ణ తదితరులు

చాందినీబండ్లకు అనుమతి తప్పనిసరి

మండలవ్యాప్తంగా జాతరలు జరిగే ప్రదేశాల్లో చాందినీబండ్లు ఏర్పాటు చేయువారు పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తీసుకోవాలన్నారు. అంతేగాక జాతర పేరుతో అశ్లీల నృత్యాలు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యను అభ్యసిస్తూనే ఉద్యోగాలు

రాజంపేట : విద్యను అభ్యసిస్తూనే ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అన్నమాచార్య యూనవర్సిటీ తోపాటు ఫార్మసీ కళాశాల ముందుంజలో ఉందని ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి అన్నారు. అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎన్నికైన 43 మందికి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామంలో ఇంజనీరింగ్ విద్యను తీసుకొచ్చిన ఘనత చొప్పా గంగిరెడ్డికే దక్కిందన్నారు. రాజంపేట ప్రాంతానికే ఇప్పుడు రోల్‌మాడల్‌గా అన్నమాచార్య యూనవర్సిటీ నిలిచిందన్నారు. విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చడమే తమ సంకల్పమన్నారు. ప్రిన్సిపల్ డా.స్వర్ణలత ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు కొనసాగాయి. నియామకాలను సైంటిఫిక్ ఎల్వినా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ హెచ్‌ఆర్‌ఎంటీ బృందం చేపట్టింది. వైస్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్, ఫ్లోర్ హెడ్ శ్రావణి, టీం లీడర్ నితీష్‌కుమార్, సీనియర్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ప్రశాంత్ బృందంలో ఉన్నారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ నరసింహులు, డా.హంజా బేగ్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూలో 2025 టెక్ ఫెస్ట్

రాజంపేట : ఏయూలో ఏప్రిల్ 9, 10వ తేదీల్లో టెక్‌ఫెస్ట్ నిర్వహించనున్నట్లు అన్నమాచార్య యూనవర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా.ఈ.సాయిబాబారెడ్డి తెలిపారు. శుక్రవారం యూనవర్సిటీ గ్యాలరీ టెక్‌ఫెస్ట్ – 2025 కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించే వేదికగా నిలవనున్నదన్నారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, బృందచేతన, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే లక్ష్యంగా పలు పోటీలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.మల్లికార్జునరావు, ప్రిన్సిపల్ డా.నారాయణ, కన్వీనరు డా.ఎం.సుబ్బారావులతోపాటు పలువురు డీన్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

అడవుల రక్షణతోనే పర్యావరణ పరిరక్షణ

సిద్దవటం : ప్రతి ఒక్కరూ అడవులను రక్షించి, పర్యావరణాన్ని కాపాడాలని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని శ్రీ సాయి ఉన్న పాఠశాల విద్యార్థులు ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులు సిద్దవటం రేంజ్‌లోని సాబ్‌బావి బేస్ క్యాంపు అటవీ ప్రాంతంలో అడవుల పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రేంజర్ కళావతి మాట్లాడుతూ అటవీ సంపదను కాపాడాలన్నారు. పచ్చని చెట్లు పెంపకం వల్ల అధిక వర్షాలు పడతాయన్నారు. అడవుల పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అడవుల్లో చెట్లు నరకడం గాని, నిప్పు పెట్టడం గాని, నేరమని తెలియజేశారు. అడవుల్లో సహజంగా లభించే ఆయుర్వేద మొక్కలు వైద్యానికి చాలా ఉపయోగపడుతాయన్నారు. అలాంటి అడవులను కొల్లకొట్టరాదని ఆమె చెప్పారు. అంతే గాకుండా అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు అంతరించి పోకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కావున అటవీ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలను పడవేయవద్దని సూచించారు. అడవుల ప్రాముఖ్యత, వన్య ప్రాణుల కాపాడే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించామని రేంజర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, బీటు అధికారులు, ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది, ప్రొటక్షన్ వాచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



పుల్లంపేట: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సిద్దవటం: అడవుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

అడవులే జీవనాధారం

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అటవీ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలోని పురాతన చెట్లను సందర్శించారు. ఈ సందర్భంగా వారు చెట్ల ప్రాముఖ్యత వివరిస్తూ చుట్టూ మానవహారంగా నిలబడి మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ అడవులే మనకు జీవనాధారమని, మానవ మనుగడలో వృక్షాల పాత్ర ఎంతో కీలకమని తెలియజేశారు. చుట్టూ ఉన్న చెట్లను నరుకుతూ పోతే అనేక జీవరాసుల మనుగడకే ప్రమాదమని ప్రతి ఒక్కరూ గుర్తించి చెట్లను పెంచాలని ఆయన సూచించారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు

గాలివీడు : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీపీఓ మస్తాన్ వలీ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ వద్ద వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషన్ రెడ్డితో కలసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.లక్ష్మిదేవమ్మ, ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు నాయక్, సచివాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.